క్లుప్తంగా

ప్రేమికుల రోజున 'తల' విడుదల



లబ్బీపేట(విజయవాడతూర్పు): తాను దర్శకత్వం వహించిన తల చిత్రాన్ని ఈ నెల 14వ తేదీ ప్రేమికుల దినోత్సవం రోజున విడుదల చేయనున్నట్లు ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు అమ్మ రాజశేఖర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తన కొడుకు రాగిన్ రాజ్ హీరోగా తెలుగు, తమిళ భాషాల్లో చిత్రించిన తల సినిమా సంచలనాలు సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి మాస్ అండ్ యాక్షన్ చిత్రాన్ని తెలుగు, తమిళ ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. సమావేశంలో హీరో రాగిన్ రాజు, హీరోయిన్ నోరా ఎస్తేర్ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి హేయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): అజాతశత్రువుగా పేరొందిన మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి ఘటన అత్యంత హేయమైనదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల ముద్రగడ ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో మంగళవారం ఆయన కిర్లంపూడిలో ముద్రగడ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ముద్రగడ ఇంటిపై దాడికి పాల్పడటం ఆందోళనకు గురిచేసిందని తెలిపారు. శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా విశేష సేవలు అందించిన ముద్రగడ పద్మనాభంపై దాడి చేయటం కూటమి ప్రభుత్వ కుట్రల్లో భాగమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


రసాయనాల ట్యాంకర్‌ను సీజ్ చేయాలని ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విషపూరిత రసాయనాలను ప్లాట్లలోకి డంపింగ్ చేస్తున్న వ్యక్తులతో పాటు దాని వెనుక ఉన్న వారిపై దర్యాప్తు చేయాలని, అలాగే నేరానికి ఉపయోగించిన ట్యాంకర్ లారీని సీజ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని జక్కంపూడి పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి ట్యాంకర్ లారీలోని విషపూరితమైన కెమికల్‌ను జక్కంపూడి 60/40 ప్లాట్లలో పారబోస్తున్నారు. విషయాన్ని ప్లాట్ల రైతులు తెలియచేసిన మీదట తాను జక్కంపూడి వీఆర్వోతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ట్యాంకర్ డ్రైవర్‌ను ప్రశ్నించగా తన పేరు బీరేంద్ర రాయ్ అని చెప్పాడు. దీనిపై దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టాలని స్థానికులు పోలీసులను కోరారు.

పట్టణ ప్రణాళిక సిబ్బంది అంతర్గత బదిలీలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే పట్టణ ప్రణాళిక విభాగం టీపీవోలు, టీపీబీవోలు, టీపీఎస్‌లను అంతర్గతంగా బదిలీ చేస్తూ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల జరిగిన బదిలీల్లో వచ్చిన కె.సునీత(టీపీవో)ను 57, 60, 61, 62, 63, 64 డివిజన్లకు కేటాయించగా, ఎస్‌కే రిజ్వానా(టీపీవో)ను 34, 35, 49, 55, 56 డివిజన్లకు కేటాయించారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎన్.గిరి(టీపీవో)ను 23, 24, 25, 26, 36 డివిజన్లతోపాటు 15, 16, 17, 18, 20, 21, 22 డివిజన్లకు బదిలీ చేశారు. జి.కృష్ణ(టీపీవో)ను 11, 12, 13, 14 డివిజన్లకు బదిలీ చేయగా ఎస్‌కె మతీన్‌మహజీజ్(టీపీఎస్)ను 2, 3, 4, 5 డివిజన్లకు బదిలీ చేశారు. అలాగే బి.మురళీగౌడ్(టీపీవో)ను 38, 39, 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48 డివిజన్లకు బదిలీ చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవటం ద్వారా దానిని తరిమికొట్టవచ్చని ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ అనీల పాటిబండ్ల అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 40 ఏళ్లు సమీపించిన ప్రతి మహిళ దీనిపై అవగాహన పెంచుకోవటంతో పాటు శరీరంలో జరుగుతున్న మార్పులను గమనించాలన్నారు. మారుతున్న జీవనశైలిని సరైన మార్గంలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యాపకురాలు డాక్టర్ రమాదేవి అధ్యక్షత వహించారు.

మురుగులో అప్‌యార్డ్ రైల్వే కాలనీ

- గ్రౌండ్ ఫ్లోర్‌లో చేరిన మురుగు నీరు
- వారం రోజులుగా మురుగుతోనే కాలనీవాసుల సహజీవనం
- డ్రెయిన్‌లో సిల్ట్ పేరుకుపోవడంతోనే సమస్య
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



డ్రెయిన్ నీటితో నిండిన అప్‌యార్డ్ రైల్వే కాలనీ రోడ్డు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని అప్ యార్డ్ రైల్వే కాలనీలో వారం రోజులుగా డ్రెయిన్లు పొంగి కాలనీలోని కొన్ని ప్రాంతాలు మురుగు నీటితో నిండిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేదో కుండపోత వర్షాలు కురవటం లేదా నగరానికి వరదలు వచ్చిన సందర్భం అనుకుంటే పొరపాటు పడినట్లే. ఇది కేవలం కాలనీలోని వాడుక నీరు ప్రవహించే డ్రెయిన్లు పూడుపోవడం కారణంగానే రైల్వే కాలనీ మురుగు నీటి ముంపునకు గురైంది. నగరంలోని కేఎల్ రావు నగర్ నుంచి ఫోర్‌మెన్ బంగ్లా వరకు విస్తరించి ఉన్న అప్‌యార్డ్ రైల్వే కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీలోని వాడుక నీరు డ్రెయిన్ ద్వారా ఫోర్‌మెన్‌బంగ్లా, రైల్వే డిజిల్ ట్యాంకర్ల మీదుగా నైజాంగేటు సెంటర్‌లోని అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో కలుస్తోంది. అయితే ఈ డ్రెయిన్లు మొదట విశాలంగా ఉన్నా, డీజిల్ ట్యాంకర్‌ల వద్ద వెడల్పు తక్కువగా ఉండటం, అందులో సిల్ట్ పేరుకుపోవడం కారణంగా డ్రెయిన్ వాటర్ ప్రవహించే దారి లేక కాలనీ ముంపునకు గురైంది.



నీట మునిగిన కాలనీ ప్రధాన రోడ్డు

తాత్కాలిక ఏర్పాట్లతో ఉపయోగం లేదు..

సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఉపయోగం లేకపోవడంతో కాలనీ వాసులు గత శనివారం విజయవాడ రైల్వే డీఆర్ఎంను కలిసి సమస్యపై వినతిపత్రం ఇవ్వడంతో అధికారులు స్పందించారు. కంటి తుడుపు చర్యగా తాత్కాలికంగా మోటార్లతో నీటితో తోడి ఏదైతే సమస్య ఉందో ఆ డ్రెయిన్‌లోనే పంపించడంతో మురుగు నీరు పారే దారి లేక మళ్లీ ఆ నీరంతా కాలనీలోకే చేరటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రౌండ్ ఫ్లోర్‌లోకి చేరిన మురుగు నీరు

వారం రోజులుగా మురుగుతో సహజీవనం..

వారం రోజులగా కాలనీలో డ్రెయిన్లు పొంగి మురుగునీరు రోడ్ల మీద పారటంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లోని నివాసాల్లో చేరటంతో స్థానికులు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. కొంతమంది ఇళ్లను ఖాళీ చేసి బంధువుల ఇళ్లకు వెళ్లగా, మరికొంత మంది పై అంతస్తులకు వెళ్లి ఉంటున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విధులకు వెళ్లి వచ్చే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. ఇక్కడి సమస్య తీవ్రతపై ఫిర్యాదు చేస్తే మురుగు తగ్గే వరకు ఎక్కడికైనా వెళ్లండి అంటూ ఓ అధికారి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం పట్ల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా మురుగు నీటిలోనే..



వారం రోజులుగా మురుగు నీరు ఇళ్లలో చేరి ఇళ్లలో ఉండలేకపోతున్నాం. కుటుంబ సభ్యులతో కలిసి ఓ హోటల్‌లో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాం. మురుగు కొంత మేర తగ్గటంతో ఇళ్లు శుభ్రం చేసుకున్నాం. ఇంటి ముందు రోడ్డు, వరండాలో ఇంకా నీరు నిలిచే ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.గురవమ్మ, గ్రౌండ్‌ఫ్లోర్ నివాసి

అధికారులకు ఫిర్యాదు చేసినా..



వారం రోజుల నుంచి కాలనీ నీట మునిగినా అధికారులు స్పందించకపోవడం బాధాకరం. దీనిపై ఫిర్యాదు చేస్తే నీరు తగ్గేవరకు ఎక్కడికైనా వెళ్లండంటూ సమాధానం చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– కాళ్ల నాగేశ్వరరావు, రైల్వే ఉద్యోగి

సమస్య పరిష్కారానికి చర్యలు..

కాలనీలోని మురుగు నీటి డ్రెయిన్లు పూడుకుపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరపాలకసంస్థ అధికారుల సమన్వయంతో నైజాంగేటుసెంటర్‌లోని సిల్ట్ తొలగింపు చర్యలు చేపట్టాం. ఈ పనులు పూర్తయితే కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

– జీఎస్ రాజు, ఎస్ఎస్, ఐఓడబ్ల్యూ

రైల్వే హాస్పిటల్‌లో క్యాన్సర్‌పై అవగాహన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ రైల్వే హాస్పిటల్, న్యూ ఓపీడీ భవనంలో మంగళవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసులు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్సపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ డాక్టర్ రాజేష్ క్యాన్సర్‌కు దారితీసే కారణాలు, లక్షణాలు, ఆహార అలవాట్లు, ముందస్తు గుర్తింపు, నివారణ పద్ధతులను వివరించారు. ఆహారపు అలవాట్లు, సరైన జీవనశైలిలో మార్పులతో క్యాన్సర్ నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. 40 ఏళ్ల పైబడిన వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ ఎల్.రవికాంత్, సిబ్బంది, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

గెలాక్సీ సామ్‌సంగ్ ఎస్ 25 ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): కస్టమర్లకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని సత్యా షోరూమ్స్ అధినేత సెంథిల్ సత్యా అన్నారు. విజయవాడలోని సత్య షోరూమ్‌లో మంగళవారం గెలాక్సీ సామ్‌సంగ్ ఎస్ 25 ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ల కోసం నూతన ఆవిష్కరణ గెలాక్సీ సామ్‌సంగ్ ఎస్ 25 అందించడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ ఈ డివైజ్‌పై ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.

యాంఫీ థియేటర్ ఏర్పాటుకు చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావు పార్కులో ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు యాంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. కేఎల్ రావు పార్కును మంగళవారం ఆయన పరిశీలించారు. చిట్టినగర్, కొత్తపేట పరిసరాల్లో పర్యటన సందర్భంగా కేఎల్ రావు పార్కుకు విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర వాకర్స్‌తో కలిసి కొద్ది సేపు నడిచారు. పార్కులో వాకర్స్ ట్రాక్, బోటింగ్ కెనాల్, ఐలాండ్‌లను పరిశీలించారు. పార్కు మధ్యలో ఉన్న ఐలాండ్‌లో యాంఫీ థియేటర్ ఏర్పాటుకు అనువుగా ఉందని, ఆ దిశగా అవసరమైన మరమ్మతులు నిర్వహించి, తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు పార్కులో ఆహ్లాదంగా నడిపేందుకు అనువైన వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం గతేడాది వరద ముంపు కారణంగా పూర్తిగా దెబ్బతిందని షటిల్ ప్లేయర్స్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న మరమ్మతు పనులను కమిషనర్ పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో ఉన్న ఫ్లోరింగ్ నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పార్కులో జరుగుతున్న లైటింగ్ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. పార్కుకు వచ్చే సందర్శకుల వాహనాలను నిలిపేందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి హెల్త్ కార్డులు

విజయవాడస్పోర్ట్స్: ప్రజా శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం పాటుపడే పోలీసులకు రాయితీతో వైద్య సేవలు అందించేందుకు 100 మంది డాక్టర్లు ముందుకురావడం అభినందనీయమని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీసు అధికారుల, సిబ్బంది కుటుంబ సభ్యులకు ఫ్రీ కన్సల్టెన్సీతో పాటు చికిత్సకు అయ్యే ఖర్చులో 20 నుంచి 30 శాతం రాయితీ కల్పించేందుకు నగరంలోని 25 ఆస్పత్రులు ముందుకు వచ్చాయి. దీని నిమిత్తం వీరు సిద్ధం చేసిన హెల్త్ కార్డులను పోలీసు సిబ్బందికి కమిషనరేట్ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబు మంగళవారం అందజేశారు. హెల్త్ కార్డుల జారీలో కీలక పాత్రం పోషించిన 1991 బ్యాచ్ పోలీసు అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి శాలి, సరిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా, 1991 బ్యాచ్ పోలీస్ అధికారులు మారుతీరావు, దామోదరరావు, కోటేశ్వరరావు, రత్నరాజు, మెహర్ బాబు, సత్యానందం, దుర్గారావు, మురళీధర్, వంశీధర్‌గౌడ్, ధర్మేంద్ర, రాజీవ్‌కుమార్, భాస్కరరావు, రఘురామ్మోహన్, ప్రసాదరావు పాల్గొన్నారు.



వైద్య బృందంతో సీపీ రాజశేఖరబాబు, పోలీస్ అధికారులు

పోగొట్టుకున్న బంగారు వస్తువులు అప్పగింత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆలయ ప్రాంగణంలో జారవిడుచుకున్న బంగారం, వెండి వస్తువుల పర్సు తిరిగి భక్తురాలికి చేరాయి. ఈ ఘటన మంగళవారం ఆలయ ప్రాంగణంలో చోటు చేసుకుంది. తాడిగడపకు చెందిన పోతుల పద్మ, నరేంద్రలు కుటుంబం అమ్మవారి సన్నిధిలో చిన్నారికి అన్నప్రసన్న నిమిత్తం ఆలయానికి విచ్చేశారు. అయితే ఆలయానికి చేరుకునే క్రమంలో లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద పద్మ తాను పట్టుకున్న ప్లాస్టిక్ కవర్‌లో ఉంచిన బంగారపు నల్లపూసల దండ, వెండి పట్టీలను జారవిడుచుకుంది. అనంతరం గమనించి వస్తువుల కోసం వెతికినా ప్రయోజనం లేదు. దీంతో ఆలయ ప్రాంగణంలోని మైక్ ప్రచార కేంద్రంలో పర్సు పోయినట్లు చెప్పించారు. ఈ క్రమంలో ఆటోనగర్‌కు చెందిన లలితాకుమారికి ఆ పర్సు దొరికింది. బాధితురాలు పద్మను పర్సులో ఏం ఉన్నాయని ఆరా తీశారు. పోలీసుల సమక్షంలోనే తనకు పర్సు దొరికిందని, అందులో అన్ని వస్తువులు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. అనంతరం పర్సును ఆమెకు అప్పగించారు. దీంతో పద్మ కన్నీటి పర్యంతమై లలితాకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటులో మొదటి గంట ఎంతో కీలకం

వించిపేట(విజయవాడపశ్చిమ): ఎవరైనా గుండెపోటుకు గురైన సందర్భంలో మొదటి గంటలో వారికి అందించే చికిత్స ఎంతో కీలమని, ఆ సమయంలో స్పందిస్తే రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించుకోవచ్చని డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్ పేర్కొన్నారు. కొత్తపేటలోని షేక్ రాజాసాహేబ్ ఆరోగ్యం కేంద్రంలో గుండె సంబంధిత వ్యాధులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నాయక్ మాట్లాడుతూ.. చాలా వరకు గుండె సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన లేకపోవడంతోనే ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఛాతిలో నొప్పిగా ఉంటే గ్యాస్ నొప్పి అంటూ ఎవరికీ వారే నిర్ధారణ చేసుకుని సకాలంలో చికిత్స పొందలేక పోవడం ఎక్కువగా జరుగుతుందని చెప్పారు. గుండెపోటుకు గురయ్యే పరిస్థితులు, లక్షణాలు, చికిత్స విధానం తదితర వాటిపై క్లుప్తంగా వివరించారు. గుండె రోగులను ఆశ వర్కర్లు గుర్తించి దగ్గరలోని పీహెచ్‌సీలు, లేదా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి తగిన పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేయాలన్నారు. మొదటి గంటలోనే వ్యాధిని గుర్తిస్తే రూ.45 వేల విలువ చేసే ఇంజెక్షన్ ఇవ్వడంతో వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆ ఇంజెక్షన్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గుండెకు భరోసా పేరుతో ఏర్పాటు చేసిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి, డాక్టర్ దుర్గానాగేంద్ర, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీసీహెచ్ఎస్ నాయక్

లారీ డ్రైవర్‌ను బెదిరించి ఫోన్‌తో ఉడాయింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లారీ డ్రైవర్‌ను బెదిరించి ఫోన్ లాక్కున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంకు చెందిన పసల పాపారావు లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి ఇబ్రహీంపట్నంలో బూడిదను లోడ్ చేసుకుని సూరంపల్లి వెళ్లేందుకు బయలుదేరారు. వైవీ రావు ఇన్నర్ రింగ్ వద్దకు వచ్చే సరికి రోడ్డుపై ఓ యువకుడు చేతిలో రాయి పట్టుకుని లారీ ఎదురుగా నిల్చున్నాడు. దీంతో భయపడిన పాపారావు లారీని ఆపగా, ఆ యువకుడు లారీలోకి ఎక్కాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత పాపారావు ఫోన్ లాక్కుని పారిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడు కట్టా పోలరాజుగా గుర్తించినట్లు పోలీసులు చెప్పారు.

వైభవంగా రథ సప్తమి వేడుకలు



గరుడ వాహనంపై స్వామివారు



శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం పలు ప్రాంగణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు రామరత్నమాచార్యులు పంచామృత అభిషేకాలు అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, అర్చనలు చేపట్టారు. ఊరేగింపులో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, బెవర సూర్యనారాయణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని పురాతన ఆలయమైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు ఉభయదేవరులతో కలిసి ఏడు వాహనాల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా శ్రీవారు వన్‌టౌన్‌లోని ఆలయంలోనూ ఏడు వాహనాలను అధిరోహించి భక్తులను తన్మయుల్ని చేశారు. కార్యక్రమంలో చైర్మన్ గుడిపాటి పాపారావు, మాజీ పాలకవర్గ సభ్యుడు గర్రె సురేష్ పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న సూర్యభగవానునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రముఖులు మాట్లాడుతూ నగరంలో ఎక్కడ సూర్యనారాయణమూర్తి ఆలయం లేదన్నారు. తమ మందిరం ప్రాంగణంలోనే స్వామి వారు కొలువై ఉన్నారని చెప్పారు. కార్యక్రమాలను శ్రీకృష్ణ ప్రార్థనా మందిరం కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావులు పర్యవేక్షించారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని

పాత శివాలయంలో..

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ సూర్యనారాయణ స్వామి వారి జయంతి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి తృచ మహాసౌర అరుణ సూర్య నమస్కారాలు అరుణ పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు.



పాత శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రధానంగా అరుణ యంత్రాన్ని తీర్చిదిద్ది కార్యక్రమాలను నిర్వహించారు.



సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థినులు

కూరపాటి పాఠశాల విద్యార్థులు సూర్యనమస్కారాలను నిర్వహించారు. ఆ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య విద్యార్థులచే సూర్య నమస్కారములు యోగాసనాలను వేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రథ సప్తమి అంటే సూర్య జయంతి అని, సూర్యుడు ఆరోగ్య ప్రదాత అని వివరించారు. పాఠశాలలో విద్యార్థులందరూ ఉత్సాహంగా సూర్యనమస్కారాలలో పాల్గొన్నారు. పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.

ఆరోగ్యప్రదాత సూర్యభగవానుడు

విజయవాడకల్చరల్: ఆరోగ్యప్రదాత సూర్యభగవానుడని మద్ది సుబ్బారావు స్కూల్ కరస్పాండెంట్ గోండ్ల రామారావు అన్నారు. వన్‌టైన్‌లోని స్కూల్ ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలను మంగళవారం నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు ట్రై సైకిళ్లు అందించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య కార్మికులకు విధుల్లో సరిపడిన ట్రై సైకిళ్లు లేకపోవడంతో వ్యర్థాల తరలింపులో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, వెంటనే ట్రై సైకిళ్లను అందించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 56వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన సిబ్బందితో మాట్లాడారు. నగరంలో వ్యర్థాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, కాని వాటని సేకరించేందుకు ట్రై సైకిళ్లు చాలా తక్కువ ఉంటున్నాయని చెప్పారు. దీనిపై నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టి పెట్టి తక్షణమే స్పందించి సిబ్బందికి ట్రై సైకిళ్ల అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో తెలుగు మహాసభలు

విజయవాడ కల్చరల్: ఛత్తీస్‌గఢ్ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో మార్చి 8, 9వ తేదీల్లో జాతీయ స్థాయి తెలుగు మహాసభలను నిర్వహించనున్నట్లు తెలుగు సంఘం కన్వీనర్ ఎల్.రుద్రమూర్తి తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేట ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా తెలుగువారున్నారని సాంస్కృతికంగా, సామాజికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాయపూర్ వేదికగా సభలు జరుగుతాయని చెప్పారు. ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు ఇతర రాజకీయ ప్రముకులు, సాహితీవేత్తలు మహాసభలో భాగస్వాములు అవుతున్నట్లు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రమూర్తి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, గణేష్, కొండలరావు

తెలుగు సంఘాల ప్రతినిధి కొండప్ప వెంకట్రావ్ మాట్లాడుతూ సభలో పాల్గొనే వారు 98274 08575 నంబరులో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు పాల్గొన్నారు.

వీఎంసీ రెవెన్యూ సేవలు సద్వినియోగం చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో రెవెన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి అనేకమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వీటిని పరిష్కరించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటోందని డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఇంటి పన్నులు వేయటం(లేవీ ఆఫ్ న్యూ హౌస్ ట్యాక్స్), ఇంటి పన్ను పేరుమార్పు చేయటం(మ్యూటేషన్), కొత్తగా ఖాళీ స్థలం పన్ను విధింపు(లేవీ ఆఫ్ న్యూ వేకెండ్‌ల్యాండ్ ట్యాక్స్), ఖాళీ స్థలం పన్ను పేరుమార్పు(మ్యూటేషన్ ఆఫ్ వేకెంట్‌ల్యాండ్ ట్యాక్స్), ఇంటి పన్ను తగ్గింపు(రివిజన్ పిటిషన్) ఇంటి పన్ను విడగొట్టడం(సబ్ డివిజన్), ఇతర వివరాలు(డోర్ నంబరు తప్పులు సరిచేయటం, పేర్లు తప్పులు సరిచేయటం తదితరాలు) ఫిర్యాదులు వస్తున్నాయని వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఆన్‌లైన్‌లో అయితే హెచ్‌టీటీపీ://సీడీఎంఏడాట్‌ఏపీడాట్‌జీవోవీడాట్‌ఇన్//ఆన్‌లైన్‌సర్వీసెస్/ప్రోపర్టీటాక్స్/ల్యాండ్‌టాక్స్(వీఎల్‌టీ) ద్వారా నిర్దేశిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. నగర వాసుల సౌకర్యార్థం కూడా నగరంలోని 64 డివిజన్లలో ఉన్న సచివాయాలు, మూడు ప్రాంతాల్లో ఉన్న సర్కిల్ కార్యాలయాల్లో అసిస్టెంట్ కమిషనర్(రెవెన్యూ), నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు.